సాక్షి చిత్తూరు

శనివారం । 29 । జూలై । 2023



బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. - 8లో



హోంగార్డుల సంక్షేమానికి కృషి

జిల్లాలోని హోంగార్డుల సంక్షేమానికి పోలీస్‌శాఖ కృషి చేస్తున్నట్లు ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. - 8లో



	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	36	27
తిరుమల	31	21
గూడూరు	32	28
నగరి	37	27

న్యూస్‌రీల్

నేడు, రేపు విద్యుత్ బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో శని, ఆదివారం సెలవు రోజులైనప్పటికీ వినియోగదారులు యథావిధిగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సర్వీసులను ట్రాన్స్‌కో సిబ్బంది తనిఖీ చేశారు. తిరుపతి ఆపరేషన్ 113, తిరుపతి రూరల్ 48, పుత్తూరు 195, చిత్తూరు అర్బన్ 77, చిత్తూరు రూరల్ 45, మదనపల్లె 52, పీలేరు 31, పుంగనూరు పరిధిలో 79 మొత్తం 3,154 సర్వీసులను తనిఖీ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 640 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. ఈ మేరకు రూ.11.52 లక్షల జరిమానా చెల్లించాలని సదరు సర్వీసుదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వెల్లడించారు.

ద్రౌపదీదేవికి వితరణగా స్వర్ణాభరణం



స్వర్ణాభరణం అందిస్తున్న జగదీశ్వరన్ దంపతులు

కార్వేటినగరం : మండలకేంద్రంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం టెక్సాస్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ పుదూరు జగదీశ్వరన్, రేఖ దంపతులు స్వర్ణాభరణాన్ని విరాళంగా అందించారు. దాత మాట్లాడుతూ పుట్టిన ఊరైన కార్వేటినగరానికి ఎంతో రుణపడి ఉన్నామన్నారు. స్థానిక ఆలయాల అభివృద్ధికి సహకారం అందించడంతో భాగంగానే రూ.2.87 లక్షల విలువైన (41గ్రాములు) బంగారు ఆభరణాన్ని అందజేసినట్లు వివరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమనాథ్ ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబురెడ్డి, కృష్ణమూర్తి, గ్రామస్తులు విజయకుమార్‌పిళ్లై, హేమాద్రి పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తం



ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ

సాక్షి, చిత్తూరు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన పునరావాస కేంద్రాలు, తాగునీరు, ఆహారం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. బాలింతలు, గర్భిణుల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బ తిన్న ఇళ్లు, పంటల వివరాలు సేకరించి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వర్ష బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు.

మానవతాదృక్పథంతోనే సస్పెన్షన్ తొలగింపు


చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ సస్పెన్షన్‌ను మానవతా దృక్పథంతో తొలగించినట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనపై గతంలో సస్పెన్షన్ వేటు వేశామన్నారు. విచారణకు పూర్తిగా సహకరిస్తానని తెలియజేయడంతో ఇప్పుడు వాల్మీకిపురంలో పోస్టింగ్ ఇచ్చామని వెల్లడించారు.

30న వన్నెకుల క్షత్రియుల సమావేశం

పలమనేరు : పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో ఈ నెల 30వ తేదీన జిల్లా వన్నెకుల క్షత్రియ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసన్, పీఎం వెంకటాచలపతి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 'రాష్ట్ర నేత సీఆర్ రాజన్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు వెల్లడించారు.

పరిశ్రమిస్తూ.. ఉద్యోగమస్తు!

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిశ్రమల ఖిల్లాగా విరాజిల్లుతోంది. విపక్ష పార్టీల నాయకుల కళ్లు బైర్లు కమ్మేలా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను మరింత ప్రోత్సహిస్తోంది. పరిశ్రమల స్థాపనకు అనతికాలంలోనే సకల వసతులతో కూడిన అనుమతులు మంజూరు చేస్తోంది. దీనికితోడు పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉండడం పెట్టుబడీదారులకు కలిసి వస్తోంది. నాలుగేళ్లలో సుమారు రూ.21వేల కోట్లకుపైగా పెట్టుబడులు రాగా.. 44వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు కల్పించింది.



పక్క ఊర్లోనే ఉద్యోగం



మాది తడ. ఎంబీఏ పూర్తిచేశా. 2014లో శ్రీసిటీ ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ జపాన్ పరిశ్రమలో హెచ్ఆర్ ట్రైనీగా అవకాశం వచ్చింది. నేడు డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. మా ఇంటి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం అంటే మామూలు విషయం కాదు. నా భర్త కూడా ఈ ప్రాంతంలోని మరో పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. పన్నెండేళ్ల క్రితం తడ చుట్టు పక్కల అడవిని తలపించేది. ఇప్పుడు సిటీ మాదిరిగా ఉంది.

–టీ.సాయికృష్ణశ్రీ, డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, శ్రీసిటీ

పరిస్థితులు మారాయి



మాది సత్యవేడు మండలం, వానెల్లూరు గ్రామం. మా గ్రామంలో అమ్మాయిలకు ఇంటర్‌తో చదువు ఆపేసేవారు. అంతకు మించి చదివితే ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వెళ్లాలి. అంత దూరం వెళ్లడం సేఫ్టీ కాదనుకునేవారు. గ్రామానికి అతి సమీపంలో శ్రీసిటీ రావడంతో పరిస్థితులు మారాయి. అమ్మాయిలు బాగా చదివి ఇక్కడే ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మా ఊర్లో ఇంటికి ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు.

–వీ.నిరోషా, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ అండ్ వెల్ఫేర్ ఆఫీసర్, కెల్లాగ్స్, శ్రీసిటీ



సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీస్తోంది. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోంది. ప్రత్యేక ఆర్థిక మండలిగా తొలుత ప్రారంభమైన శ్రీసిటీ 'ఏకీకృతపారిశ్రామిక నగరం'గా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు.. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఉండడం పారిశ్రామిక వేత్తలకు కలిసివస్తోంది. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ టెలికమ్యూనికేషన్, రక్షణ సారశక్తి, ఏరోస్పేస్, ఇంజినీరింగ్ యంత్ర సామగ్రి, దుస్తులు, ఆహార శుద్ధి, ఐటీ సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. సత్యవేడులోని శ్రీసిటీ, ఏర్పేడు, రేణిగుంట, గంగవరంలో విదేశీ సంస్థలు తమ కర్మాగారాలను స్థాపించాయి.



శ్రీసిటీ ఏరియల్ వ్యూ

నాలుగేళ్లుగా క్యూకడుతున్న పరిశ్రమలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జపాన్, చైనా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్‌కు చెందిన పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారు.
- జపాన్‌కు చెందిన ఇసుజు సంస్థ తన అనుబంధ కంపెనీ ఇసుజూ మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెట్‌ను రూ.3వేల కోట్లతో శ్రీసిటీలో నిర్మించింది.
- కొబెల్కో గ్రూపునకు చెందిన సంస్థ శ్రీసిటీలో క్రేన్ హైడ్రాలిక్ క్రేన్లు, కొబెల్కో కన్‌స్ట్రక్షన్ మెషినరీ విభాగాల కేంద్రాలను స్థాపించింది.
- త్యవేడు, వరదయ్యపాళెం, తడ, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గంగవరం మండలాల పరిధిలో టైర్స్, ఫుడ్, ప్లాస్టిక్, ప్లైవుడ్, ఇంజినీరింగ్, కేబుల్, అల్యూమినియం, 2, 4 వీలర్స్, పీఓపీ, రెడీమేడ్స్, టైల్స్, డెయిరీ, గార్మెంట్స్, సీసీ కెమెరాల పరిశ్రమలను స్థాపించారు.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వెయ్యికిపైగా ఏర్పాటు చేశారు.
- ఏడాది క్రితం రూ.5,430 కోట్లతో ఏర్పాటైన 19 భారీ పరిశ్రమల ద్వారా స్థానికులు 7,946 మంది ఉద్యోగాలు పొందారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈఎంసీ (ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్)–1, 2తోపాటు రేణిగుంట, గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్, తక్కిన చిన్న, భారీ, మధ్యతరహా పరిశ్రమలు మొత్తం 1,483 ఉండగా.. ఈ కర్మాగారాల్లో 36వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు.
- అమరరాజా, రిక్సక్లాత్ కర్మాగారాల్లోని ఉత్పత్తులతోపాటు రేణిగుంట మండలం గాజులమండ్యంలోని కొన్ని ఫార్మా కంపెనీల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ ఏర్పడింది.
- రూ.3,263 కోట్ల పెట్టుబడితో 9 పరిశ్రమలు ప్రారంభంకానున్నాయి. వీటి ద్వారా 5,607 మంది ఉపాధి పొందనున్నారు.
- ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబెల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక వేత్తలు ఎంఓయూలు కుదుర్చుకున్నారు.
- గూడూరు పరిధిలో 12 వేల ఎకరాల్లో రూ.5,800 కోట్లతో క్రిస్ సిటీ పేరుతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో రూ.1,500 కోట్లతో రెండువేల ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. 3 లక్షల మందికి మరో 5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.
- తిరుపతిలో రూ.వెయ్యి కోట్లతో 450 ఎకరాల్లో కాన్సెప్ట్ సిటీ ఏర్పాటుకు చురుగ్గా పనులు సాగుతున్నాయి.
- విజయపురం మండలంలో 8వేల ఎకరాల్లో శ్రీసిటీ తరహాలో ఓ పారిశ్రామిక వాడ రానుంది. ఇక్కడ పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే కేశవపురం వద్ద కొంత భూసేకరణ పూర్తయ్యింది. ఇంకొంత భూమి సేకరించాల్సి ఉంది.

ఉపాధి సిటీ

సత్యవేడు శ్రీసిటీ పరిధిలో 28 దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు రూ.4,860 కోట్ల పెట్టుబడులతో 215 కంపెనీలకు పైగా ఏర్పాటు చేశారు. వాటిలో ఆటోమొబైల్ కంపెనీలు, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్స్, ఇంజినీరింగ్ కంపెనీలు, ఎఫ్ఎంసీసీ ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్‌అండ్ వేర్‌హౌసింగ్, పేపర్ అండ్ ప్యాకేజింగ్, ఫార్మా అండ్‌హెల్త్‌కేర్, రీవబుల్ ఎనర్జీ, టెక్స్‌టైల్స్‌అండ్ నాన్ ఉవెన్‌ఫ్యాబ్రిక్, అథర్ సర్వీస్ సెక్టార్‌లు ఏర్పాటు చేశారు. ఒక్క శ్రీసిటీ పరిధిలోనే 60వేల మందికి ఉద్యోగాలు లభించాయి.

నగరాలను తలపిస్తున్న పల్లెలు

సత్యవేడు, వరదయ్యపాళెం, తడ, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గంగవరం మండల పరిసరాల్లో నెలకొన్న గ్రామాలు నేడు పరిశ్రమల రాకతో శరవేగంతో అభివృద్ధిచెందుతున్నాయి. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉపాధి అవకాశాలు లభించడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. గ్రామాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు పెరుగుతూ నగరాలను తలపిస్తున్నాయి. భౌగోళికంగా, సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధిస్తూ ఆదర్శ ఆర్థిక మండళ్లుగా కీర్తి గడిస్తున్నాయి. సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని వరదయ్యపాళెం మండల పరిధిలో అపోలో టైర్ల పరిశ్రమ, అవంతి తోళ్ల పరిశ్రమ, హీరో మోటార్‌కు చెందిన ద్విచక్ర వాహనాల తయారీ పరిశ్రమల రాకతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి.

మహిళా సాధికారత

మహిళలు నేడు పారిశ్రామిక వాడల్లో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణలో పాలుపంచుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. శ్రీసిటీలో మహిళలే సగం మంది ఉండడం ఇందుకు నిదర్శనం. కేవలం ఒక్క మొబైల్ ఫోన్ల తయారీ పరిశ్రమలోనే 15వేల మందికి పైగా మహిళలు పనిచేస్తుండడం విశేషం.

నాడు కష్ట తరం..

ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే గతంలో పేపర్లు చేతబట్టుకుని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాలి. ఆ తరువాత ఎప్పటికో అధికారులు వెళ్లి విజిట్ చేసి రిపోర్ట్ ఇస్తారు. ఆ పరిశ్రమ ఏర్పాటుకు అధికారి అనుకూలంగా రిపోర్ట్ ఇవ్వాలంటే.. మామూళ్లు ఇవ్వక తప్పదు. ఇంకా వివిధ రకాల సబ్సిడీలు పొందాలన్నా లంచం ఇవ్వందే మంజూరు చేసేవారు కాదు.

నేడు సులభం.. మెరుగ్గా ప్రోత్సాహం

కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఆన్‌లైన్ విధానం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 45 శాతం, పురుషులకు 35 శాతం సబ్సిడీ ఇప్పుడు లింగవివక్ష లేకుండా అందరికీ 45శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పెట్టుబడి రూ.1.25 కోట్ల వరకు పెంచారు. గతంలో ఐదేళ్ల వరకు గ్రానైట్ పరిశ్రమకు యూనిట్ రూ.1 చొప్పున సబ్సిడీ ఇస్తుంటే.. నేడు ఎనిమిదేళ్లకు పెంచి యూనిట్ రూ.2 సబ్సిడీ ఇస్తున్నారు. కోవిడ్ సమయంలో చిన్న తరహా పరిశ్రమల కోసం రూ.100 కోట్ల వరకు ఇచ్చి ప్రోత్సహించారు.



గంగవరం వద్ద సెజ్ ఏరియల్ వ్యూ



రేణిగుంటలో ఏర్పాటైన వివిధ పరిశ్రమలు

మరిన్ని పరిశ్రమలు

"రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు పారిశ్రామిక కారిడార్‌లు అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరవుతున్నాయి. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కోవిడ్ సమయంలో నష్టపోయిన చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందించాం. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు రానున్నాయి.

– ప్రతాప్‌రెడ్డి, జీఎం పరిశ్రమలశాఖ

'సురక్ష'కు సర్వత్రా ప్రశంసలు

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నిర్వహించిన వార్డు బాటలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగనన్న సురక్ష అనతికాలంలో ప్రజలందరికీ చేరువై మన్ననలు పొందిందన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులతో కలసి నిర్వహించిన కార్యక్రమంలో సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించామని వెల్లడించారు. అలాగే ప్రజలకు అవసరమైన ధ్రువీకరణపత్రాలను పంపిణీ చేశామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను కూడ అక్కడికక్కడే మంజూరు చేసినట్లు వివరించారు. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనున్న జగనన్న సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓర్వలేకే ఆరోపణలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా పరిపాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే చంద్రబాబు, ఆయన పుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ చూస్తున్నారని రాబోయే ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందని స్పష్టం చేశారు. జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, విరూపాక్షి జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసన ర్యాలీ

చిత్తూరు రూరల్: మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం చిత్తూరు నగరంలోని క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో బీటీ మెమోరియల్ చర్చి నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. డేవిడ్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే క్రైస్తవులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోకనాథన్, జ్యోతి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

వరసిద్ధుని సేవలో ఐఏఎస్ అధికారులు



ఐఏఎస్ అధికారులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వినాయక స్వామిని ఛత్తీస్‌గఢ్ ఐఏఎస్ అధికారులు అన్బళగన్, అలారంమెయిల్మంగయ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈఓ వెంకటేశు దర్శన ఏర్పాట్లు చేశారు.


పేదలందరికీ కార్పొరేట్ వైద్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : రాష్ట్రంలోని పేదలందరికీ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. శుక్రవారం మండలంలోని పెద్దబైలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల ఆరోగ్య రక్షణకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి దేశ వ్యాప్తంగా ప్రశంసలందుకున్నారన్నారు. తదనంతర కాలంలో చంద్రబాబు ఆరోగ్యశ్రీపై విషం చిమ్మారని, ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకుండా పథకాన్ని నీరుగార్చేశారని మండిపడ్డారు. అయితే ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్యశ్రీలో పేరుకుపోయిన రూ.1,500 కోట్ల బకాయిలను చెల్లించి గొప్ప మనసు చాటుకున్నారని తెలిపారు. అలాగే 3,200 వ్యాధులను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకువచ్చి పేదల పాలిట దేవుడయ్యాడని వెల్లడించారు. దేవుడు జన్మనిస్తే జగనన్న పునర్జన్మ ఇస్తున్నాడని చెప్పారు. ధనవంతులకు కొమ్ముకాసే చంద్రబాబు పేదల పాలిట శాపంగా తయారయ్యారని విమర్శించారు. టీడీపీ ప్రస్తుతం అంపశయ్యపై ఉందని, త్వరలోనే కనుమరుగు కావడం తథ్యమని స్పష్టం చేశారు.

ప్రజావసరాల మేరకు పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న సెల్వమణి

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి కొనియాడారు. శుక్రవారం చింతలపట్టెడ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన 1,270 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సెల్వమణి మాట్లాడుతూ చింతలపట్టెడ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా రూ.19 కోట్లు అందించినట్లు వెల్లడించారు. ఎన్నికలు వస్తేనే టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తుకువస్తారని విమర్శించారు. చివరిరోజున పసుపుకుంకుమ ఇచ్చి ఏమార్చే చంద్రన్నకు, తొలిరోజు నుంచే ప్రతి పథకాన్ని మహిళల పేరుతో అమలు చేస్తున్న జగనన్నకు తేడాను గమనించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు జగనన్న అని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రోఖర్‌రెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, సచివాలయాల పట్టణ కన్వీనర్ దయానిధి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పీజే నళిని, గిరిజాకుమారి, ఇంద్రయ్య, కో–ఆప్షన్ సభ్యుడు ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, డీఈ నరేష్, నాయకులు నటరాజన్, అమర్, బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారదర్శక పాలనకు పెద్దపీట


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పారదర్శక పాలనకు పెద్దపీట వేశామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బదిలీల్లో ఆరోపణలకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. అయితే కొందరు పనిగట్టుకుని సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని టార్గెట్ చేసి జెడ్పీ పరువు తీయాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు తమకు ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని కానీ, అసత్య ప్రచారాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో నివాసముండాలి అనే నిబంధన ఉన్నప్పటికీ కొందరు ఉద్యోగులు బయట ప్రాంతాల నుంచి ఉదయం 11 గంటలకు కార్యాలయాలకు వస్తున్నారన్నారు. తర్వాత టీ బ్రేక్, మధ్యాహ్నం లంచ్ బ్రేక్ అంటూ గంటల సమయం వృథా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. కొందరు అధికారులు తమ సెక్షన్లలో అందుబాటులో ఉండకపోవడమే కాకుండా, సెలవు పెట్టిన సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కార్యాలయంలో బదిలీలు, పోసింగ్‌ల వంటి అంతర్గత సమాచారాన్ని టీడీపీ నేతలు, ఎల్లో మీడియాకు లీక్ చేస్తున్నారని, ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందులో భాగంగానే ఇటీవల నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. చిత్తూరు రూరల్ మండలమం చెర్లోపల్లెకు చెందిన టీడీపీ నేత రమేష్‌నాయుడు గతంలో చేసిన పనులు నాసిరకంగా ఉన్నట్లు వచ్చిన విజిలెన్స్ నివేదిక మేరకు రూ.9 లక్షలు రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. దీంతో ఆయన కక్ష గట్టి తప్పుడు వార్తలు రాయిస్తున్నారని మండిపడ్డారు.

బాలింతలు, గర్భిణులకు పక్కాగా వైద్యం

చిత్తూరు రూరల్: జిల్లాలోని బాలింతలు, గర్భిణులకు పక్కాగా వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మాతా శిశుమరణాల నివారణకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అధికారులు రేణుకప్రభ, జార్జ్, గుణశేఖర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కార్పొరేషన్ : పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జెడ్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షిస్తే వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని సూచించారు. తద్వారా రోగ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమ్య, జెడ్పీటీసీ సభ్యులు భారతి, పీఐయూ ఈఈ రమణయ్య, డీపీఆర్సీ డీసీ షణ్ముగం పాల్గొన్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎస్‌ఈలు ఉమామహేశ్వర్‌రెడ్డి, శంకర్‌బాబు, ఆడిట్ డీఆర్ ఉషారాణి మొక్కలు నాటారు.

జడ్జి క్వార్టర్స్‌లో ప్లాంటేషన్ డే

చిత్తూరు అర్బన్ : నగరంలోని జడ్జి క్వార్టర్స్‌లో ప్లాంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, చిత్తూరు 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మాధవి, శ్రీకాళహస్తి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కృష్ణప్రియ, చిత్తూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జె.కీర్తన, పీలేరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రి, చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ పాల్గొన్నారు. న్యాయమూర్తి ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ వెంకట ప్రసాద్, సీఎంఎం గోపీ పాల్గొన్నారు. అలాగే చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె.అరుణమొక్కలు నాటారు. కార్యక్రమంలో మేనేజర్ తనూజ, ఎంహెచ్‌ఓ లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

డీటీసీలో...

చిత్తూరు రూరల్ : నగరంలోని డీటీసీ ఆవరణలో డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఆర్టీఓ సునీల్‌కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంవీఐలు రాజేశ్వరరావ్, వాసుదేవారెడ్డి పాల్గొన్నారు. అలాగే తుమ్మింద గ్రామ సచివాలయం వద్ద వైస్ ఎంపీపీ రంజని మొక్క నాటారు.

చిత్తూరు కలెక్టరేట్ : మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ విధానాల్లో సాగు చేస్తున్న రైతులకు 19 రకాల విత్తనాలను అందించామన్నారు. అందులో తొమ్మిది రకాల ధాన్యాలతో పాటు, కూరగాయల విత్తనాలు ఉన్నట్లు వెల్లడించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన 1,205 మంది రైతులకు విత్తనాల కిట్‌లను అందజేసినట్లు తెలిపారు. ఒక్కొక్క కిట్ ధర రూ.9,500 ఉంటుందని వివరించారు.


రైతులకు విత్తనాల కిట్‌లు అందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

దశాబ్దాల కల సాకారం

- పోడుచేన్లు రోడ్డు పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: పోడుచేన్లు వాసుల దశాబ్దాల కల సాకారం అవుతోంది. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు కోరినా మాజీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దాదాపు 70 కుటుంబాలు ఉన్న ఈ గ్రామం నుంచి కడపల్లెకు రాకపోకలు సాగించడానికి 1.2 కిలోమీటర్లు ఇరుకైన మట్టి రోడ్డు ఉండేది. రాతి బండలు, ఎత్తు పల్లాలుగా ఉన్న మార్గం వర్షాలతో కోతకు గురైతే రాకపోకలకు దుర్భరంగా ఉండేది. రోడ్డు సమస్యను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ఎమ్మెల్సీ భరత్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం రూ 1.5 కోట్లను మంజూరు చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోడుచేన్లకు రోడ్డు వేయిస్తామని అప్పటి వైఎస్ఆర్ సీపీ కుప్పం ఇన్‌చార్జ్ దివంగత చంద్రమౌళి అప్పట్లో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆయన కుమారుడు ఆయన హామీని నెరవేర్చారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- యూనియన్ బ్యాంకు మేనేజర్ లలితాంబ
- ముగిసిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్


విజయం సాధించిన చిత్తూరు విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

మదనపల్లె సిటీ(అన్నమయ్య జిల్లా) : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని యూనియన్ బ్యాంకు మేనేజర్ లలితాంబ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్-23 విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విధిగా ఏదో ఒక క్రీడలో పాల్గొనాలన్నారు. దీంతో ఫిట్‌నెస్ పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు మాట్లాడుతూ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌కు కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, కరేకల్, పాండిచ్చేరికి చెందిన నవోదయ విద్యార్థులు వచ్చి పాల్గొన్నారన్నారు. వచ్చే నెల 3న రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, వెంకటరమణ, పీడీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే

క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ 211 పాయింట్లతో మొదటి స్థానం నిలిచింది. 74 పాయింట్లతో నెల్లూరు రెండో స్థానం, 51 పాయింట్లతో కడప మూడో స్థానంలో నిలిచింది. కస్టర్ లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో హరీష్(కరేకల్) మొదటి స్థానం, శ్రీకర్‌రెడ్డి(ప్రకాశం) రెండో స్థానం, భరత్‌చంద్రారెడ్డి (కడప) మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

పేలుడుతో ఆవుకు తీవ్రగాయాలు



సదుం: పందుల వేటకు ఉంచిన పేలుడు పదార్థాలను కొరకడంతో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తాటిగుంటపాళెం పంచాయతీ ఎర్రగుంట్లవారిపల్లెలో వై.మధుసూదన్‌రెడ్డికి చెందిన ఆవు గ్రామ సమీపంలోని బంజరు భూమిలో మేతకు వెళ్లింది. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు పందుల వేటకోసం ఉంచిన నాటు (పేలుడు పదార్థం) బాంబును తినేందుకు ప్రయత్నించడంతో అది పేలి తీవ్రంగా గాయపడింది. ఆవు పరిస్థితి విషమంగా ఉందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవు విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

బోయకొండలో కాళికాదేవి విగ్రహం ఏర్పాటుకు చర్యలు


మంత్రి సమక్షంలో నగదు అందజేస్తున్న దాతలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద చిన్నబోగం, పెద్దబోగం సమర్పించే ప్రదేశంలో ఉగ్రరూప అవతారంలో కాళికాదేవి విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పుంగనూరులో వార్డు బాట కార్యక్రమం చేపట్టారు. ఆయనను జయలక్ష్మి, మహేష్‌రెడ్డి, దిగువపల్లె ఉపసర్పంచ్ కె.సరిత, శ్రీనాథ్ దంపతులు కలిసి విగ్రహ ఏర్పాటుకు రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు.

వినాయగన్ సేవలు మరువలేం


కలెక్టర్‌తో ఆర్మీ అధికారులు

పూతలపట్టు: చార్‌ధామ్ యాత్రికులను కాపాడే క్రమంలో 2013 జూన్ 25వ తేదీన హెలీకాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన వీర జవాన్ వినాయగన్ సేవలు మరువలేమని కలెక్టర్ షణ్మోహన్ కొనియాడారు. శుక్రవారం మండలంలోని చిన్నబండపల్లెలో ఐటీబీపీ తరపున ఏర్పాటు చేసిన వినాయగన్ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. 53వ ఇండో టిబెటిన్ బోర్డర్ ఫోర్స్ కమాండెంట్ అమిత్ బెట్టితో కలిసి వినాయగన్ స్మారక మందిరాన్ని ప్రారంభించారు. దేశసేవలో ప్రాణాలు అర్పించిన వినాయగన్ కుటుంబానికి అన్ని విధాలుగా తోడుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ ఆయూష్ దీపక్, తలపులపల్లె బాబురెడ్డి, సర్పంచ్ మహేశ్వరి పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


దెబ్బతిన్న టమాట పంట

సదుం: మండలంలోని పచ్చార్లమాకులపల్లె సమీంలోని నేరేళ్ల చెరువు వద్ద పంట పొలాలపై ఏనుగులు గురువారం రాత్రి దాడి చేశాయి. దినకర, పురుషోత్తం, కేశవులు, వెంకటరమణ, నారాయణ అనే రైతులకు చెందిన సుమారు ఐదు ఎకరాల్లో వరి, టమాటా పంటలను నాశనం చేసినట్లు బాధితులు తెలిపారు.

పులిచెర్ల మండల వాసికి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



డీజీపీ నుంచి మెడల్ అందుకుంటున్న రామచంద్ర

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం బండారువారిపల్లె(కురవపల్లె)కు చెందిన బి.రామచంద్రకు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ లభించింది. రామచంద్ర ప్రస్తుతం అసోంలో సీఆర్పీఎఫ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా సీఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం గౌహతిలో జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌ను అసోం డీజీపీ నుంచి అందుకున్నారు.

ఫుట్‌బాల్ సబ్ జూనియర్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఫుట్‌బాల్ జిల్లా సబ్ జూనియర్ జట్టును ఎంపిక చేశారు. 70మంది క్రీడాకారులు ఎంపికకు హాజరయ్యారు. ఎంపికైన వారిని జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్‌రెడ్డి, కిశోర్ అభినందించారు. క్రీడాకారులు తిరుపతిలో జరిగే జోనల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కుప్పం/శాంతిపురం : కుప్పం నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు, ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా మద్యం స్వాదీనం చేసుకున్నారు. కుప్పం మండలం ఉప్పకుండా గ్రామంలో దాడులు నిర్వహించి చిన్నతండి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ అధికారి ఆయేషా తెలిపారు. 2,588 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేశామన్నారు. దాడిలో ఎస్ఈబీ సీఐ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే శాంతిపురం మండలం 64 పెద్దూరు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బొలేరోలో తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుబడింది. తమిళనాడుకు చెందిన నిందితులు వేలుమణి(25), హుస్సేన్(25)ను అదుపులోకి తీసుకున్నట్లు రాళ్లబూదుగూరు ఎస్ఐ మునస్వామి తెలిపారు. రూ.2.10లక్షల విలువైన 3,300 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి


రవీంద్రనాథ్ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న పోలీస్ అధికారులు

చిత్తూరు అర్బన్ : హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఏఆర్ పరేడ్ గ్రౌండ్స్‌లో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఏస్పీ ఆదేశాల మేరకు హోంగార్డుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. హోంగార్డులు విధులతోపాటు కుటుంబ సభ్యుల బాగోలు, ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలని సూచించారు. చిత్తూరులో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన ఆరోగ్యం కేంద్రం, సబ్సిడీ క్యాంటీన్‌ను వినియోగించుకోవాలని కోరారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని స్పష్టం చేశారు. అనంతరం ఉద్యోగవిరమణ చేస్తున్న రవీంద్రనాథ్ దేశాయ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆగస్టులోపు పల్లెబాట అర్జీల పరిష్కారం


మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్సీ భరత్

కుప్పం : కుప్పం నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించిన పల్లెబాటలో ప్రజలు అందించిన అర్జీలను ఆగస్టులోపు పరిష్కరించనున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పల్లె బాటలో వచ్చినా అర్జీలను శాఖలవారీగా విభజించినట్లు వెల్లడించారు. ఆ మేరకు అన్నింటినీ పరిష్కరించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కదిలిరావడం ఆనందంగా ఉందన్నారు. బీఎల్‌ఓలు సమష్టిగా పనిచేసి తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు తులసీ, గంగాభవానీ, పద్మనాభం, ఆర్డీఓ శివయ్య, మంత్రి పెద్దిరెడ్డి పీఏ తుకారాం, కుప్పం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేతల చేరిక


టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలు అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ నాయకులు రహంతుల్లా, న్యామతుల్లా, హందుల్లాతో పాటు 10 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మైనార్టీలకు ఉపముఖ్యమంత్రి పదవితో పాటు అనేక పదవులు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, అయాజ్, అస్లాం మురాధి, అఫ్సర్, యూనస్ పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణే ధ్యేయంగా పాదయాత్ర


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అశుతోష్ పాండే

నగరి : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశుతోష్ పాండే అనే యువకుడు పాదయాత్ర చేస్తున్నారు. ప్రకృతిని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమంటూ వివరిస్తూ 21 రాష్ట్రాల్లో 16వేల కిలోమీటర్ల పర్యటనకు నడుంబిగించారు. ఈ క్రమంలో శుక్రవారం నగరి పట్టణానికి చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ రక్షణ ఆవశ్యకతను వివరించారు. చెట్లను కాపాడే బాధ్యతను తీసుకోవాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో చెప్పడానికే రూ.90 వేల జీతాన్ని వదలిపెట్టి తల్లిదండ్రులను ఒప్పించి ఈ పాదయాత్ర చేస్తున్నానన్నారు. ఇప్పటి వరకు 7 రాష్ట్రాల్లో, 5,800 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసినట్లు వెల్లడించారు.